విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తుండ్రు

నవతెలంగాణ-వర్ని

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని పొట్టిగుట్ట తండాలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని ప్రజాప్రతినిధులు తెలిపారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన కొనసాగింది. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఆయా శాఖలో చేపడుతున్న పనుల వివరాలను వెల్లడించారు. తదుపరి విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతుండగా సర్పంచులు తమ గ్రామాలకు విద్యుత్తు అంతరాయం కలుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో బసిరుద్దీన్, ఎంపీవో చందర్, ఏపిఓ మంజుల, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐని ఎల్లారెడ్డి నుంచి తరలించవద్దు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004 ఎల్లారెడ్డికి మంజూరు అయిన కళాశాలను నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తే ఐదు కోర్సులతో కొట్లాడి 2010 డిసెంబర్‌లో తీసుకువచ్చామని, ఎన్నో ఉద్యమాలు చేసి తెచ్చుకున్న కళాశాలలో నేడు కేవలం ఒకే కోర్స్ కల్పించడం సమంజసం కాదని అన్నారు. అధికారులను అడిగితే సిబ్బంది లేని కారణంగా కోర్సుల కుదింపు చేస్తున్నామని చెప్తారన్నారు. 2.5 కోట్లతో అన్ని వసతులతో ఏర్పాటు చేసుకున్న కళాశాలలో నేడు పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే సిబ్బంది కొరత లేకుండా చూసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాలలో తరగతి గదులు పరిశీలించి, అపరిశుభ్రంగా ఉండడం చూసి సిబ్బంది పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తులసి దాస్, సృజన్, తదితరులున్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో

దేశాన్ని కాపాడుకుందాం

- కార్మిక సంఘాల మహాధర్నా
- వందలాదిగా పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు



ధర్నాలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నరేంద్ర మోడీ నాయకత్వంలోని కార్పొరేట్ అనుకూల కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మందబలంతో బరితెగించి ప్రజా కార్మిక వ్యతిరేక విధానాల పరిపాలనను కొనసాగిస్తున్నదని, జాతీయ సహజ వనరులు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తుందని, డీజిల్, పెట్రోల్ వంటగ్యాస్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడారి సునీల్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాస్, వర్దయ్య విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు రెండు రోజుల దేశవ్యాప్త మహా ధర్నాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రెండవ రోజు కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 4 లేబర్ కోడులను రద్దు చేయాలని, రైతాంగానికి కనీస మద్దతు ధర ప్రకటించాలని, కాంట్రాక్టు విధా నం రద్దుచేసి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులను చట్టపరమైన కనీస వేతనాలు చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కేంద్ర సర్కార్ ప్రభుత్వరంగ మౌలిక వసతులు, సహజ వనరులను కార్పొరేట్లు లూఠీ చేసే విధానపర నిర్ణయాలను అమలు చేస్తున్నదన్నారు. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థల్లో 100 శాతం వాటాలు తెగనమ్ముకున్నదని విమర్శించారు. కార్మికులు, మధ్యతరగతిలో అత్యధికులు పాలసీదార్లుగా ఉన్న ఎల్ఐసీలో లక్ష కోట్ల రూపాయల వాటాలు అమ్మేందుకు తెగబడిందన్నారు. కార్పొరేట్లు ఎగ్గొట్టిన రుణాలతో ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేస్తున్నదని వివరించారు. ఈ విధానాలు ఉద్యోగుల భద్రతతో పాటు దేశ ఆర్థిక స్వావలంబనకే ముప్పు తెస్తున్నాయని చెప్పారు. అనేక త్యాగాలు, రక్త తర్పణతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడ్‌లుగా మారుస్తూ పార్లమెంట్ చట్టం చేసిందన్నారు. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడిందన్నారు. ఈ మహా ధర్నాకు వామపక్ష నాయకులు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శ సుధాకర్, సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, రైతు సంఘం జిల్లా నాయకులు కంజర భూమయ్య మాట్లాడుతూ.. సుమారు 40 కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులు ఈ లేబర్ కోడ్‌తో బానిసత్వంలోకి నెట్టబడతారని తెలిపారు. ప్రభుత్వ స్కీంల్లోని కోటిమంది స్కీం వర్కర్లు ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకునే స్థితిలేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా ముత్యన్న, భూమయ్య శివ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు శివరాజ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింగ్ రావు, సీఐటీయూ జిల్లా నాయకులు కటారి రాములు, కృష్ణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలి

- 2వ ఏఎన్ఎంల డిమాండ్

నవతెలంగాణ-విలేకరుల బృందం


రెంజల్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న ఏఎన్ఎంలు

తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ 2వ ఏఎన్ఎంల డిమాండ్ చేశారు. పలు చోట్ల గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు.

బోధన్ : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం బోధన్, సాలూర మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు నల్ల బ్యాడ్జీలు ధరించి పీహెచ్సీల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా 2వ ఏఎన్ఎంల ప్రతినిధి సంధ్యారాణి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో తాము రెండవ ఏఎన్ఎంలు గా పనిచేస్తున్నామని అన్నారు. రెగ్యులర్ ఉద్యోగులుగా అన్ని పనులు చేస్తున్నామని ఆయిన ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని ఆమె వాపోయారు. ఈమధ్య విడుదల చేసిన ఏఎన్ఎంల భర్తీ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సావిత్రి, సరస్వతి, సమత, లలిత, నాగజ్యోతి, శశికళ, రజిని తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : డోంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహించే సెకండ్ ఏఎన్ఎంలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డొంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సెకండ్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రమైన రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించి, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాగ్యమ్మ, కళావతి, రాణి, శ్యామల, లావణ్య, శోభా, జమున, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను పర్మినెంట్ చేయాలని ఆరోగ్య కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోనీ మత్తమాల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుధా, శ్రీలత, ఇందిరా, ప్రమీల, స్వప్న, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రెండవ ఏఎన్ఎంలు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఏఎన్ఎంలు అనురాధ, గంగామణి, రేఖ, స్వప్న, సరిత, శాంత, సవిత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నుంచి శ్రీశైలం బహిష్కరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ కార్యదర్శిగా ఉన్న శ్రీశైలం సంఘం నిబంధనలను అతిక్రమించడం వలన ఎస్ఎఫ్ఐ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఎస్ఎఫ్ఐ నుంచి బహిష్కరించినట్టు ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు లవిశెట్టి ప్రసాద్ తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీలో ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. ఎస్ఎఫ్ఐతో శ్రీశైలంకు ఎలాంటి సంబంధం లేదని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు వెంకటేష్, నాయకులు చత్రు, సాయి ప్రసాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

మాదిగ సామాజిక వర్గానికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

- విద్యావంతుడు సీతయ్య



ర్యాలీలో పాల్గొన్న మాదిగ దండోరా నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మాదిగ సామాజిక వర్గానికే జుక్కల్ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని విద్యావంతుడు, సామాజిక సేవకుడు సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాదిగ సామాజిక వర్గాల మేధావులు, యువకులు, మాదిగ దండోరా ఆధ్వర్యంలో కలిసి వీధుల్లో భజాభజంత్రీలతో మాదిగల బలప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎమ్మెలే టికెట్ ఆశిస్తున్న సీతయ్య ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి ర్యాలీ ప్రారంభించారు. జుక్కల్ నియోజకవర్గంలో స్థానిక పెద్దల సహకారంతో 15 లక్షల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలకు సామాగ్రిని అందించామని పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు వాలీబాల్, క్రికెట్ కిట్లు అందించామన్నారు. అంతేకాకుండా ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలో మాల సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తే, మాదిగ సామాజిక వర్గానిక ఒకసారి మాత్రమే అవకాశం వచ్చిందన్నారు. ఈ సారి బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెలే అభ్యర్థిగా జనాభా అధికంగా ఉన్న మాదిగలకు టికెట్ కేటాయించాలని, న్యాయమైన అభ్యర్థనను ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, రాములు, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25కే పోస్టాఫీస్‌లో జాతీయ జెండా

నవతెలంగాణ-జుక్కల్


పోస్టాఫీస్ వద్ద త్రివర్ణ పథకాలు

మండల కేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో రూ.25కే జాతీయ జెండాను త్రివర్ణ పథకం అమ్మనున్నట్టు సబ్ పోస్ట్ మాస్టర్ షేక్ షకీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశ ప్రజలు సగర్వంగా ఘనంగా చేసుకునేందుకు అందులో భాగంగా హర్ఘర్ తిరంగలో కార్యక్రమంలో భాగంగా ఆఫీస్‌లో అందుబాటులో ఉంచామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెడ్‌పోస్ట్ మాస్టర్ సూచించారు.

ఎమ్మెల్యే షకీల్‌కు సన్మానం

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు కృతజ్ఞతగా గురువారం బోధన్ ఆర్టీసీ కార్మికులు ఎమ్మెల్యే షకీల్ అమీర్‌ను ఆయన నివాసంలో కలుసుకొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎస్సీ కార్మికుల జీవితాలు మారలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో తాము ప్రభుత్వ ఉద్యోగులుగా మారామని హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ గొప్ప సంకల్పంతో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని అన్నారు. ఆయన మేలు మరిచిపోలేమని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్, కార్మిక సంఘం నాయకులు ఉన్నారు.



అడవిని నరికే అధికారం ఎవరికి లేదు

- డీఎస్పీ శ్రీనివాస్

నవతెలంగాణ-లింగంపేట్


పోలీసు బలగాల మోహరింపు

అడవులు నరికే అధికారం ఎవరికీ లేదని, అడవులు నరికితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఎక్కపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎక్కపల్లి గ్రామ సమీపంలో కంపార్ట్మెంట్ నెంబర్ 691లో ఎక్క పల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులందరూ గత మూడు రోజులుగా అడవిలోకి వెళ్లి చెట్లను పొదలను సుమారు 40 ఎకరాలపైగా నరికివేశారు. బుధవారం అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని గ్రామస్తులకు నచ్చ చెప్పారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అటవీ శాఖ అధికారులు, గ్రామస్తుల మధ్య వాగ్వాదం నెలకొంది. అడవిలో చెట్లు నరకవద్దని అటవీ శాఖ అధికారులు సూచించినా గ్రామస్తులు పట్టించుకోలేదు. ఇతరులకు పోడుపట్టాలిచ్చారని, ఎక్కపల్లి గ్రామంలో నిరుపేదలు భూమిలేని వారు చాలామంది ఉన్నారని వారికి పట్టాలి ఇవ్వాలని గ్రామస్తులు బుధవారం డిమాండ్ చేశారు. దీంతో సమస్య తీవ్ర రూపం దాల్చింది. అటవీశాఖ అధికారులపై గ్రామస్తులు తిరగబడ్డారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఎల్లారెడ్డి డీఎస్పీ జిల్లా అటవీ శాఖ ఎఫ్‌డిఓకు సమాచారం అందించారు. పోలీసుల సహకారం తీసుకున్నారు. గురువారం సాయంత్రం ఎక్క పల్లి గ్రామంలోకి జిల్లా కేంద్రం నుండి పోలీస్ బలగాలను మోహరించారు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు ఎక్కపల్లి గ్రామస్తులు అడవులు నరికిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు.

పలువురిపై కేసు నమోదు..

ఎక్కపల్లి గ్రామ సమీపంలోని కంపార్ట్మెంట్ నెంబర్ 691 లో గత మూడు రోజులుగా ఎక్క పల్లి గ్రామస్తులు అడవిలో వెళ్లి చెట్ల పొదలను నరికివేశారు. దీంతో అటవీ చట్ట ప్రకారం ఐదుగురుపై కేసుతో పాటు ఇతరులపై కేసు నమోదు చేసినట్టు డిఎస్పి శ్రీనివాస్ తెలిపారు.

అడవిలో 144 సెక్షన్..

మండలంలోని ఎక్కపల్లి గ్రామ సమీపంలోని అడవిలో పోలీస్‌లు 144 సెక్షన్ విధించారు.

ఇస్తే అందరికీ ఇవ్వాలి..

ఎక్కపల్లి గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో కంపార్ట్మెంట్ నెంబర్ 691లో ఇతరులకు పట్టాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఇస్తే అదే భూమిలో నిరుపేదలందరికీ పట్టాలివ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. 2005 ఐదు నుంచి సాగులున్న వారికి పట్టాలు ఇచ్చారని, మాకెందుకు ఇవ్వలేదని గ్రామస్తులు మండిపడ్డారు.

గ్రామస్తులపై పోలీసుల లాఠీచార్జ్.. పోలీస్ స్టేషన్లకు తరలింపు

మండలంలోని ఎక్కపల్లి గ్రామంలో గురువారం రాత్రి గ్రామస్తులు సమావేశమైన ప్రదేశానికి జిల్లా పోలీసు బలగాలు కరెంటు పోయిన సమయంలో అక్కడికి చేరుకొని పలువురిపై లాఠీచార్జ్ చేశారు. గుంపులను చెదరగొట్టారు. పలువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

గృహలక్ష్మికి భారీగా దరఖాస్తులు

- గురువారంతో ముగిసిన దరఖాస్తుల గడువు
- దరఖాస్తుల గడువు పెంచాలని జనం డిమాండ్

నవతెలంగాణ-బోధన్/మద్నూర్



మద్నూర్‌లో మీసేవల వద్ద జనం

ప్రభుత్వం ప్రతి నిరుపేదకు సొంతింటి కలను సహకారం చేయాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు మూడు రోజులే ఉండడంతో ఆయా గ్రామాలలోని మరింత మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోలేదు. గృహలక్ష్మి పథకం కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు గురువారం నాటికి ముగిసినట్లు అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించడంతో జనం దరఖాస్తు చేసుకోవడానికి భారీగా తరలివచ్చారు. దాంతో తహసీల్దార్ కార్యాలయాలు నిరుపేదలతో కిటకిటలాడాయి.

బోధన్ నియోజకవర్గంలో 10,565 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బోధన రూరల్ మండలంలో 2000, బోధన్ మున్సిపల్ పరిధిలో 1450, సాలుర మండలంలో 843, ఎడపల్లి మండలంలో 1700, రెంజల్ మండలంలో 1626, నవీపేట్ మండలంలో 2946 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు అత్యధికంగా నవీపేట్ మండలంలో గృహలక్ష్మి పథకానికి 2946 మంది నిరుపేదలు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం మూడు రోజులే దరఖాస్తు గడవు ఇవ్వడంతో చాలామంది నిరుపేదలు దరఖాస్తులు చేసుకోలేదని పలువురు తెలిపారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఇది నిరంతర ప్రక్రియ అని జిల్లా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ అధికారులకు ఎలాంటి ఆదేశాలు రాలేదని దాంతో దరఖాస్తుల గడువు ముగిసినట్లు అధికారులు పేర్కొనడం గమనార్హం. ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తులు చేసుకోవడానికి గడువు పెంచాలని ఆయా గ్రామాలలోని నిరుపేదలు కోరుతున్నారు.

మద్నూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రూ.3లక్షలు అందజేస్తామని.. ఈనెల 10వ తేదీ (గురువారం) చివరి కావడంతో దరఖాస్తుదారులు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బారులు తీరారు. మండల కేంద్రంలో గల మీసేవ కేంద్రాల్లో ఆదాయం, కుల ధృవీకరణ పత్రం పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఇంటి స్థలం ఉండి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఎలక్షన్ కార్డు, స్థలం కాగితాలు ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో స్థలంతో పాటు ధృవీకరణ పత్రాలు లేనివారి పరిస్థితి ఏంటని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు, అవగాహన

నవతెలంగాణ-సదాశివనగర్


పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో క్యాన్సర్ పరీక్షలు, క్యాన్సర్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డి.యం.యచ్.ఓ లక్ష్మన్ సింగ్ మాట్లాడుతూ.. ప్రథమ స్థాయిలో గుర్తిస్తే చికిత్స యుద్ధంలా పనిచేస్తుందని అన్నారు. మహిళలకు క్యాన్సర్ రొమ్ము, గర్భాశయంలో వస్తోందని తెలిపారు. క్యాన్సర్ అనేది 1,2,3,4 దశలోనే నయం చేయవచ్చని సూచించారు. క్యాన్సర్ పరీక్ష, అవగాహనకు క్యాన్సర్ గురించి తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రతి గడ్డ క్యాన్సర్ కాదని తెలిపారు. గడ్డను పరీక్ష చేసినప్పుడు తెలుస్తుందని తెలిపారు. ఈ క్యాంపు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో డి.సి.ఓ వసంత, చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, వైస్ చైర్మన్ సదాశివరెడ్డి, డాక్టర్లు సురేష్, మౌనిక, డైరెక్టర్ భాస్కర్‌లు బత్తుల రాములు, గుర్జాల నారాయణరెడ్డి, రాజేందర్, భాస్కర్, సి.ఈ.ఓ బైరయ్య, ఏపీఎం రాజిరెడ్డి, క్యాంపు సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటను రక్షించుకోవాలి

- పంటలను పరిశీలించిన సహాయ వ్యవసాయ సంచాలకులు రత్న


పంటలు పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

సస్యరక్షణ చర్యలతో పంటను రక్షించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు రత్న అన్నారు. గురువారం పత్తి, సోయాచిక్కుడు క్షేత్రాలను రత్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటల్లో గమనించిన చీడపీడలు నివారణ గురించి వివరించారు. సోయా చిక్కుడులో పల్లాకు తెగులును గుర్తించి దాని నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, రైతుబంధు సమితి అధ్యక్షులు వెంకట్‌రావు, రైతులు భూపతిరెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ ఆధ్వర్యంలో వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల సిరిసిల్ల, జగిత్యాల విద్యార్థులు గ్రామస్తుల సహకారంతో పార్టిసిపేటరీ రూరల్ అప్రైసల్ (పీఆర్ఏ) కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వనరులు, నేలల రకాలు, జనాభా శాతం, గ్రామ సామాజిక పటం, పంట పొలాల సమస్యలపై చార్టులతో ప్రదర్శించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమా రాంబాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎస్.నవీన్ కుమార్, డా.బి.వెంకట రాజ్కుమార్(ఉద్యాన విభాగం), డా.ఎం.సురేష్, శాస్త్రవేత్త (సేద్య విభాగం), కృషి విజ్ఞాన కేంద్రం డా.ఎం.శ్వేత (వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త), జగిత్యాల, సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

12న చలో హైదరాబాద్ కరపత్రాలు ఆవిష్కరణ

- జిల్లా అధ్యక్షులు కుంట ఎల్లారెడ్డి

నవతెలంగాణ-గాంధారి

ఆగస్టు 12న శనివారం టిఎస్‌సిపిఎస్ఈయు ఆధ్వర్యంలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం గాంధారి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కుంట ఎల్లారెడ్డి మాట్లాడారు. చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి లింగం, జిల్లా ఉపాధ్యక్షులు విట్టల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎమ్మార్వో ను కలిసిన ఎంపీపీ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



మండల తహశీల్దార్ కార్యాలయానికి ఎంపీపీ వెళ్లి బదిలీపై ఇక్కడకు వచ్చిన అనురోద్‌ను టీఎస్‌ఆర్టీసి చైర్మన్ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం ఎంపీపీ బానోత్ అనుష ప్రేమ్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని రైతుల సమస్యలను త్వరగా పరిష్కరించుకోవాలని ఎమ్మార్వోను కోరారు. కలిసిన వారిలో నిజామాబాద్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్ కూడ ఉన్నారు

ఎం. నర్సింహ స్వామికి డాక్టరేట్ ప్రదానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కే.శే.ప్రొఫెసర్ గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో ఎం. నర్సింహ స్వామి చేసిన పిహెచ్. డి. పరిశోధనాంశం "డాక్టర్. వెలిచాల కొండలరావు జీవితం - వాఙ్మయ సేవ" అనే సిద్ధాంత గ్రంథానికి తెలుగు అధ్యయన శాఖలో ఎ. నర్సింహ స్వామికి పిహెచ్. డి. డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. దీనికి సంబంధించిన ఓపెన్ వైవా - వోస్ (మౌఖిక పరీక్ష) గురువారం ఆర్ట్స్, సైన్స్ కళాశాలలోని మిని సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఎక్స్ టర్నల్ ఎగ్జామినర్ గా డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని తెలుగు శాఖలో అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎన్. రజని పాల్గొని పలు ప్రశ్నలు అడిగి పరిశోధకుడి నుంచి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమం లో ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి. కనకయ్య చైర్మన్‌గా, పాఠ్యప్రణాళిక సంఘ చైర్ పర్సన్ ప్రొఫెసర్ వంగరి త్రివేణి కన్వీనర్‌గా వ్యవహరించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ కె. లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తులకు బారులు

- కార్యాలయం వద్ద తాగునీరు కరువు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు

నవతెలంగాణ-మోపాల్

గృహలక్ష్మీ దరఖాస్తులకు చివరి రోజు కావడంతో మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయంవద్ద మండలంలోని ప్రజలు గురువారం ఎండలో నిలబడి మరీ బారులు తీరారు. కనీసం అక్కడ వారికి తాగునీటి సదుపాయం కూడా అందుబాటులో లేదు. కొత్తగా ఏర్పడిన మండలం కావడం వల్ల కనీసం సొంత భవనం లేక వచ్చే ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి కూడా అక్కడ సరైన సదుపాయాలు లేవు. తహసీల్దార్లను బదిలీ చేసి దాదాపు పది రోజులు గడుస్తున్న కూడా ఎమ్మార్వో వచ్చిన దాఖలాలు లేవు. వారం రోజుల నుంచి కూడా భూమి రిజిస్ట్రేషన్లు కూడా జరగడం లేదు. మంగళవారం డిప్యూటీ తాహసిల్దార్ మునిరుద్దీన్‌కు చార్జ్ ఇచ్చారు. ఆయన ఆధ్వర్యంలోనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. తహసీల్దార్‌ను ఇంకా కేటాయించకపోవడం గమనార్హం. కనీసం రెవెన్యూకు సంబంధించిన ఒక్క అధికారి కూడా గ్రామాల్లో లేకపోవడం, ఇటీవల వీఆర్ఏ వ్యవస్థను కూడా బదిలీ చేయడం వల్ల అసలైన లబ్ధిదారులను గుర్తించడం రెవెన్యూ వ్యవస్థకు తలనొప్పిగా మారుతుంది. ఈ సారైనా గృహలక్ష్మి పథకం ఇస్తారా లేదా.. ఎలక్షన్ కోసం ప్రయోగం చేస్తున్నారా.. అని ప్రజలు అంటున్నారు. తమ ఆశలు నిరాశలు కాకుండా నిరుపేదలకు ఇల్లు సదుపాయం కల్పించే విధంగా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు. మండలం నిజామాబాద్ జిల్లాకేంద్రానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఉంది.. కానీ సదుపాయాలలో ఆమడ దూరంలో ఉంటుంది. ఈ మండల పరిధిలో అత్యధికంగా తాండ గ్రామాలే ఉన్నాయి. ఈ గృహలక్ష్మి పథకం రెవెన్యూ వ్యవస్థ కాకుండా పంచాయతీ వ్యవస్థకు ఉంటే కనీసం ప్రతి గ్రామంలో కార్యదర్శి అయినా ఉంటాడు. హౌస్ టాక్స్ రూపేణ ఇంతమందికి ఇల్లు లేవు ఎవరికి ఖాళీ స్థలాలు ఉన్నాయి.. ఎవరికి లేవని గమనించేది గ్రామంలో ఉన్న ఏకైన ప్రభుత్వ ఉద్యోగి గ్రామ కార్యదర్శి మాత్రమే. ఈ గృహలక్ష్మి పథకంలోనైనా రాజకీయ జోక్యం లేకుండా దారిద్రరేఖకు దిగువనున్న వారికి అందరికీ వర్తించేలా చూడాలని నిరుపేద కుటుంబాలు ప్రాధేయపడు తున్నాయి. ఇప్పటివరకు 400 పైగా అప్లికేషన్స్ వచ్చాయని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. జిల్లా మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాత్రం ఇది నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. తమకు ప్రభుత్వపరంగా ఎటువంటి ఆదేశాలు రాలేదని, ఇదే చివరి రోజుగా మేము చూస్తున్నామని వారు చెబుతున్నారు. కనీసం ప్రభుత్వ అధికారులకు ప్రభుత్వానికి సఖ్యత లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా సరైన ఆదేశాలు ఇచ్చి గృహలక్ష్మి పథకాన్ని గాడిలో పెట్టి నిజమైన లబ్ధిదారులకు అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.



బారులు తీరిన పేదలు

అనాధ పిల్లలను గుర్తించేందుకు సర్వే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాల్లో అనాధ పిల్లలు గుర్తించేందుకు నిర్వహించే ఇంటింటి సర్వేపై గురువారం సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలను నిర్వహించారు. గ్రామంలో తల్లిదండ్రులు లేని అనాధ పిల్లల గురించి అంగన్వాడీ టీచర్ల తో సమావేశం నిర్వహించి, అనాధలను గుర్తించేందుకు ఇంటి సర్వే నిర్వహించారు. అనాధలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే, వారిని అన్ని విధంగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఈ సందర్భంగా సర్పంచులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని మెండోరా గ్రామంలోని పంటలను జిల్లా వ్యవసాయాదికారి వాజిద్ హుస్సెన్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా పంటల వివరాలను మండల వ్యవసాయాధికారి సాయికృష్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు పంటలకు వ్యాపించే చీడపురుగు నివారణ చర్యలను గురించి తెలిపారు. వరిపంటలకు తగిన మోతాదులో యూరియాను వాడాలని సూచించారు. ఈయన వెంట ఏవో సాయికృష్ణ, ఏఈవోలు లక్‌పతి మరియు రైతులు ఉన్నారు

బంజరాలను విడదీసిన ఘనత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మహేష్ కుమార్ గౌడ్



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణ - మాక్లూర్

బంజరాలను విడదీసిన ఘనత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనాని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని దుర్గనగర్ తండాలో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ దివస్‌లో ఎవగంగా బుదవారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా తండాలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బంజరాలకు రిజర్వేషన్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి నెరవేర్చలేదని, బంజరాలని, ఒడులను వేరు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వనదని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవిప్రకాష్, మాజీ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ రాజేందర్, జిల్లా అధ్యక్షులు మనల మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు దేగ పోషెట్టి, పిర్సింగ్, మైనార్టీ అధ్యక్షులు హలీం, నాయకుల పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన యువకులు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని గోన్‌గొప్పుల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బోజాగౌడ్, చరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ జిల్లా నాయకుడు ముత్యాల సునీల్ రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి కృషితో అధికారం చేపడుతుందని సునీల్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, కుంట రమేష్, పల్లెశేఖర్, జేజే నర్సయ్య, లింబాద్రి, నాయకులు ఉన్నారు

ప్రతి కార్యకర్త పార్టీ గెలుపునకు కృషి చేయాలి

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్

నవతెలంగాణ-భీంగల్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీయాదవ్ అన్నారు. గురువారం పట్టణకేంద్రంలో పార్టీ మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు శ్రీకారం చుట్టాలని ఇందుకు ప్రతి గడప గడపకు ప్రచారం చేపట్టాలని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అన్సారీ, రిత్విక్, నియోజకవర్గ అధ్యక్షుడు నాగేంద్ర, మరియు కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల, మండల అధ్యక్షులు మరియు మండల నాయకులు ఉన్నారు.

కమీషన్ల లెక్కల కోసమే జిల్లా పర్యటన :బీజేపీ

శ్మశానాలను సైతం కబ్జా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ షాడో ముఖ్యమంత్రి కేటీఆర్ తన కమిషన్ల లెక్కల కోసమే జిల్లా పర్యటనలా ఉందని బిజెపి మాజీ శాసనసభ్యుడు రాష్ట్ర నాయకుడు ఎండల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అప్రకటిత ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎలక్షన్లు వస్తున్నాయని నిజామాబాద్ నగరంలోని 60 డివిజన్లకు 60 కోట్ల రూపాయలు ఇస్తున్నట్టుగా ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. మూడు శ్మశాన వాటికలకు 15 కోట్ల పైబడి ఖర్చుగా చూపించడం ఎంత మేర అవినీతికి పాల్పడ్డారో తెలుస్తుందని అన్నారు. ఖిల్లా రఘునాథ చెరువు బిఆర్ఎస్ నాయకుల అవినీతికి నిదర్శనం అని అన్నారు. శ్మశానాలు, గోశాల భూములను సైతం దురాక్రమనకు తెగబడుతున్నారని అన్నారు. 11 సంవత్సరాల క్రితం కట్టిన మున్సిపల్ భవనానికి నేడు ప్రారంభోత్సవమా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్, అసెంబ్లీ కో కన్వీనర్ నారాయణ యాదవ్, బిజెపి నాయకులు మాస్టర్ శంకర్, బద్దంకిషన్, బాలరాజు, లింబాద్రి, రామచందర్, నాయకులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిర్యాల్ గ్రామ ఉన్నత పాఠశాలలో గురువారం ఏకరూప దుస్తుల పంపిణీ చేవారు. ఈ సందర్భంగా సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్, ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఎస్ఎంసి చైర్మన్ వాసర లావణ్య మాట్లాడుతూ.. ఆరు నుండి పదవ తరగతి వరకు బాలబాలికలకు అందరికీ ఏకరూప దుస్తులను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వ్యవసాయ కమతాల గణన

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న కలెక్టర్

పదకొండవ వ్యవసాయ కమతాల గణన పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నేడు వ్యవసాయ కమతాల గణనపై నిర్వహించిన శిక్షణ తరగతులలో కలెక్టర్ మాట్లాడుతూ.. 2021 - 22 సంవత్సర ప్రాతిపదికగా ప్రతి రెవెన్యూ గ్రామంలో వ్యవసాయ కమతాల వారీగా విస్తీర్ణం, సాగుదారుని వివరాలు, ఏయే పంటలు పండిస్తున్నారు, నీటి వినియోగం, సాగునీటి వనరులు తదితర వివరాలను రైతుల ద్వారా సేకరించాలని సూచించారు. ఈనెల 20 వ లోపు ఖచ్చితమైన వివరాలతో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సేకరించిన వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా స్మార్ట్ ఫోన్ వినియోగంతో అధికారిక సైట్‌లో అప్లోడ్ చేయాలని వ్యవసాయ విస్తీర్ణాధికారులకు సూచించారు. జిల్లాలోని 450 రెవెన్యూ గ్రామాల్లో 108 మంది గణకులు, 28 మంది సూపర్ వైజర్లు, 22 మంది మండల వ్యవసాయ అధికారులు, 25 మంది మండల గణాంక అధికారులు సర్వేలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. అనంతరం వ్యవసాయ కమతాల గణన ఉద్దేశ్యాలను, సర్వే పాదాల నిర్వచనాలు అర్థ గణాంక శాఖ, హైదరాబాద్ నుండి హాజరైన సహాయ సంచాలకులు శ్రీవల్లి, ఉప గణాంక అధికారులు సుధ, పులి రాజు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి డి.బాబురావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి 3రోజులు, మద్యానికి 15 రోజులా?

కేసీఆర్ నిజామాబాద్‌లో పోటీ చెయ్
గృహలక్ష్మి పథకానికి బడ్జెట్ ఉంటే సన్యాసం తీసుకుంటా : ఎంపి అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గృహలక్ష్మి పథకం దరఖాస్తులకు మూడు రోజుల గడువు ఇచ్చి, మద్యం టెండర్లకు మాత్రం 15 రోజుల గడవు ఇచ్చారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ధ్వజమెత్తారు. బుధవారం నిజామాబాద్ పర్యటనలో మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై ఢిల్లీలో స్పందిస్తూ కౌంటర్ ఇచ్చారు. నిజామాబాద్లో కేటీఆర్ మోసపూరిత వాగ్దానాలు ఇచ్చారని మండిపడ్డారు. ఇన్నాళ్లు గుర్తుకు రాని గృహలక్ష్మి పథకం విషయం లో ప్రభుత్వం వచ్చి అబద్దాలు చెబుతోందన్నారు. ఈ స్కీమ్కు రూ.12 వేల కోట్లు ఇచ్చామని 2022-23 బడ్జెట్ స్పీచ్‌లో ప్రభుత్వం అబద్దం చెప్పిందని ఆరోపించారు. బడ్జెట్ పత్రాలను కేటీఆర్ కంటే తానే ఎక్కువ చదివానని, ఈ బడ్జెట్లో రూపాయి గృహలక్ష్మి పథకానికి ఉంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేశారు. ఈ ఛాలెంజ్ కు తాను సిద్ధమేనని, ఎప్పుడు రమ్మంటే అప్పుడు కేటీఆర్ ఇంటికి వచ్చి నిరూపిస్తానని అన్నారు. కవితను ప్రజలు ఎప్పుడో ఇంటికి పంపించారని, కేసీఆర్, కేటీఆర్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో లక్షల రేషన్ కార్డుల దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, గృహలక్ష్మి అప్లికేషన్లకు రేషన్ కార్డులు చూపించాలని అడుగుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్ దగ్గర సంస్కారం నేర్చుకోవాలా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు దమ్ముంటే నిజామాబాద్లో పోటీ చేయాలని అప్పుడు ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో చూపిస్తామని అన్నారు. 2009లో మహాకూటమి తరఫున బరిలో నిలిచిన కేటీఆర్ 171 ఓట్లతో గెలిచారని 75 వేల మెజార్టీ ఓట్లతో గెలిస్తే దాన్ని అడ్డిమారి గుడ్డి దెబ్బ అన్నారని సెటైర్ వేశారు. రఘునాథ ఆలయం (బొడ్డెమ్మ చెరువు) వద్ద నిర్మించిన ట్యాంక్ బండ్ చెరువు కట్ట సరిగ్గా లేదని, అది తెగిపోతే ముస్లిం ప్రాంతంలోని ఇళ్లలోకి వెళ్లి ఆస్కారం ఉందని ఈ సందర్భంగానే గుర్తు చేశారు.



మాట్లాడుతున ఎంపీ అరవింద్

జీపీ నిధుల దోపిడిపై విచారణ చేపట్టాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ నిధుల దోపిడి అక్రమాలపై విచారణ చేపట్టాలని మండల కేంద్రానికి చెందిన గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ ప్రజలు, యువకులు గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు తోట బాలరాజు, కర్క బాబు రావ్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ నిధుల దోపిడీ అక్రమాలపై ప్రత్యేక అధికారులతో విచారణ జరిపి, సిరికొండ సర్పంచిపై అవినీతిని ప్రోత్సహిస్తూ, ఎంబి రికార్డ్ చేస్తూ బిల్లులు మంజూరు చేసిన పంచాయతీరాజ్ ఏఈ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. విచారణలో అవినీతి జరిగినట్లయితే సర్పంచ్ పై, పంచాయతీరాజ్ ఏఈ పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తూ ,దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేయాలని కలెక్టర్‌ని కోరామన్నారు. వీలైనంత తొందరలో విచారణ చేపట్టి అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సిరికొండ గ్రామ కమిటీ చైర్మన్ బాడల సంతోష్, క్యాషియర్ సూరునిడ గోపి, సభ్యులు కురుమ మధు, గ్రామ యువకులు తోట బాలరాజు,కర్క బాబురావు, వాల్గోట్ సతీష్, కొడిగేల రాజేందర్, కనగందుల సుకుమార్, పూల శేఖర్, ప్రశాంత్ అవధూత తిరుపతి, అవధూత సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేములను కలిసిన జిల్లా అడిషనల్ డిసిపి



నవతెలంగాణ-వేల్పూర్

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజక వర్గ అడిషనల్ డిసిపి (అడ్మిన్ లాండ్ ఆర్డర్)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జయరాం వేల్పూర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రోడ్లు, భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వేముల అడిషనల్ డిసిపికి శుభాకాంక్షలు తెలియజేశారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఫేర్వెల్ సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న క్షత్రియ విద్యాసంస్థల కార్యదర్శి

మండలంలోని చేపూరు గ్రామ శివారు క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎంబీఏ డిపార్ట్మెంట్ గురువారం ఫేర్వెల్ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్షత్రియ విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంబీఏ కోర్సు అయిపోయిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని క్షత్రియ విద్యాసంస్థలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఉద్యోగం చేస్తూ బిగ్ డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టాక్సేషన్, ఫారెస్ట్ మేనేజ్మెంట్, హాస్పిటల్ మేనేజ్మెంట్ వంటి డిప్లమా చేయడం ద్వారా వారి కెరీర్ అవకాశాలు మరింత మెరుగు పడతాయని అన్నారు. జూనియర్ల అభివృద్ధికి తోడ్పడాలని, మార్గదర్శనం చేయాలని ఉద్బోదించారు. తమ చదువుతున్న విద్యాసంస్థల అభివృద్ధికి ఆర్థిక, సామాజిక సహకారం అందించాలని కోరారు. హెచ్ ఓ డి డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు టీచర్లతో ఉన్న అనుబంధం తెంచుకొని ప్రపంచంలోకి అడుగు పెట్టడం శుభ పరిణామమని అన్నారు. విద్యార్థులు నృత్యాలతో, నాటకాలతో అలరించారు. కార్యక్రమంలో ఎంబీఏ డిపార్ట్మెంట్ టీచర్స్ పాశం సుధాకర్, ప్రతిమ, చక్రధర్, భరత్ పాల్గొన్నారు.

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో యువకుల చేరిక

నవతెలంగాణ-వేల్పూర్

రాష్ట్రంలో సీఎం కేసిఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అబివృద్ధికి ఆకర్షితులై మెండోర మండలం కొడిచెర్ల గ్రామ బీజేపీ పార్టీకి చెందిన యువకులు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారు...యోగేష్, శశికిరణ్, సాయరెడ్డి,రాజు, సన్నిత్, నవీన్,రాజేష్ పలువురు యువకులు ఉన్నారు. కార్యక్రమంలో మెండోర మండల పార్టీ నాయకులు ఉన్నారు.

తండాలో పర్యటన

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ప్రపంచ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కాజు బాగు తాండా గ్రామంలో బుధవారం రాత్రి డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పర్యటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ వల్ల గిరిజనులకు ఎలాంటి ఉపయోగాలు లేవని తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గిరిజనులకు పోడు భూముల పట్టాలు అందజేస్తామని హామీనిచ్చారు

సీఎం, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రేషన్ డీలర్లకు కమిషన్ పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేంద్రంలో మండల రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రేషన్ డీలర్ల కమిషన్ ని 140 రూపాలకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం లో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ముక్క అంజయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీని అభివృద్ధి బాటలో నడిపించాలి

సొసైటీ చాంబర్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



సహకార సొసైటీ నుంచి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు నడిపించాలని మాజీ ఎమ్మెల్సీ వి. గంగాధర్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని రాంపూర్ డి ప్రాథమిక సహకార సంఘం వద్ద కొత్తగా నిర్మించిన చాంబర్ సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్, డైరెక్టర్లు, రైతులు, సర్పంచులతో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ మాట్లాడుతు సొసైటీ భవనం 33 ఏళ్ల క్రితం నిర్మించామని, ప్రస్తుతం దుకాణాల సముదాయం నిర్మించినందువల్ల అందులోనే కార్యాలయంను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ తారాచంద్ నాయక్‌ను మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో ఇందల్ వాయి సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, పాపాయి తిరుపతి, తెలు గణేష్, నర్సయ్య, సహకార సొసైటీ వైస్ చైర్మన్ స్వామి,ఉప సర్పంచ్ యెంకనోల్ల రమేష్, డైరెక్టర్లు నాసా రాజేశ్వర్, రైతు నాయకులు రవి, సాయిలు, రఘు, దాసు, ఆశన్న, రాజేశ్వర్, గణేష్, నర్సయ్య, సీతావో నాగరాజు, నాగేశ్వర్ రావు, ఎంపిటిసి చింతల దాస్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వేధింపులకు గురైతే పట్టించుకోని పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్ టౌ

వేధింపులకు గురైతే పట్టించుకోని పోలీసులు, షీ టీంకు ఒక కాల్ చేస్తే వస్తామని చెప్పే పోలీసు వ్యవస్థ అనేకమార్లు కంప్లైంట్ ఇస్తే కూడా పట్టించుకోలేదని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బిఆర్ శివప్రసాద్ అన్నారు. గురువారం నగరంలోని ఆర్ఆర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మలక్ పేట్‌లో విజయ్ సోలంకి అనే దళిత యువకుడు తన భార్యను ఎంఐఎం కార్యకర్తలు వేధిస్తున్నారని అనేకమార్లు పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేస్తే, పట్టించుకోకపోవడంతో మనోవేదనకు గురై, మలక్ పేట్ పోలీస్ స్టేషన్ ముందు పెట్రోల్ పోసుకొని నిప్పుంటించుకొని చనిపోయారని అన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ కులచరి, బిజెపి జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందీప్ కుమారస్వామి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - వేల్పూర్

సమాజసేవ కుడు రాజారెడ్డి(పైపుల రాజిరెడ్డి) తన స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాటలు వేశారని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం మంత్రి మండలకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఉన్నత విద్య కోసం పలువురు విద్యార్థులకు ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి అందజేశారు. ఆయన వల్ల ప్రయోజనం పొందిన సుమారు 100మంది విద్యార్థులు మళ్ళీ ఆర్థిక సహాయం కోసం చూసే విద్యార్థు లకు సహాయం చేసే విధంగా చూడడం గొప్ప పరిణామమన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి

ప్రొసీడింగ్ కాపీలు అందజేసిన మంత్రి

నవతెలంగాణ-వేల్పూర్

గురువారం వేల్పూర్ లోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్, బాల్కొండ మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన 23 కుల సంఘ భవనాలకు 90లక్షల నిధులు మంజూరు ప్రొసీడింగ్స్ కాపీలను సంబంధిత సంఘాల నాయకులకు అందజేశారు.

కందకుర్తిలో అనాథ పిల్లల సర్వే

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని కందకుర్తి గ్రామంలో కార్యదర్శి నవీన్ గ్రామంలోని అనాథ పిల్లల సర్వేను నిర్వహించారు. కందకుర్తి గ్రామానికి చెందిన అమీనా బేగం (13), అలీనా బేగం (10) ఇద్దరు పిల్లలు తల్లిదండ్రులు కోల్పోవడంతో, వారి చిన్నమ్మ, చిన్న నాన్న వద్ద తలదాచుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. దుబ్బాక ప్రవీణ్(18) తండ్రి గంగాధర్, తల్లి సావిత్రి మృతి చెందడంతో అనాథ అయ్యారని, వారి నానమ్మ వద్ద తలదాచుకుంటున్నాడని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో సమగ్ర సర్వే జరిపి అనాథ పిల్లల జాబితాను తయారుచేసి సంబంధిత అధికారులకు నివేదికను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట అంగన్వాడీ కార్యకర్తలు నజీమా సుల్తానా, బాలహంస తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-పిట్లం
ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే దళిత గిరిజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యల సంతోష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దళిత గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై దశ దిశ నిర్దేశించడానికి వక్తలు ఆకునూరు మురళి, ప్రొఫెసర్ కాశీం, బద్యానాయక్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వంగపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, వీరితోపాటు ఎస్సీ, ఎస్టీ, యూఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు హాజరుకానున్న సభకు జిల్లా ఎస్సీ ఎస్టీ ఉప కులాల సంఘ నాయకులు సైతం హాజరు కానున్నారని ఆయన తెలిపారు. సభా విజయవంతం చేసేందుకు ప్రతి ప్రాథమిక సభ్యుడు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అక్రమ మొరం తరలింపు

- అడ్డుకున్న ఘన్‌పూర్ గ్రామస్తులు

నవతెలంగాణ-వర్ని
ప్రభుత్వం పర్మిషన్లు లేకున్నా ఏండ్ల నుంచి తమ గ్రామ గుంట నుంచి బడా నాయకులు అక్రమంగా మొరం తరలిస్తున్నారని ఆ గ్రామస్తులు మొరం టిప్పర్లను అడ్డుకున్నారు. చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామ శివారులో గల అక్కమ్మ గుంట నుంచి గత సంవత్సరాల నుంచి ప్రభుత్వం పేరు చెప్పి మొరం తరలిస్తున్నారని అగ్రహం వ్యక్తం చేస్తూ ఆ గ్రామస్తులు టిప్పర్లను గురువారం అడ్డుకొన్నారు.

ప్రభుత్వం పర్మిషన్లు లేకుండా అటవీ ప్రాంతం నుంచి మొరం తరలించడంతో హరిత హారం మొక్కలు దెబ్బతింటున్నాయని, పర్యావరణానికి ముప్పు తెస్తున్నారని గ్రామస్తులు, యువకులు జేసీబీలను ఆపివేశారు. ప్రభుత్వం పర్మిషన్ చూపాలని, లేనిపక్షంలో మొరం ఇవ్వబోమని అన్నారు.


అక్రమంగా మొరాన్ని తరలిస్తున్న దృశ్యం


మొరం తవ్వకాలు అడ్డుకుంటున్న గ్రామస్తులు

బడా బాబుల అండతో రెచ్చిపోయిన మొరం అక్రమార్కులు..
గ్రామస్తులు ఉదయం మొరం తరలింపును అడ్డుకొన్న సాయంత్రం మళ్ళీ మొరం తరలించడంతో గ్రామ పెద్దలు టిప్పర్లను ఆపారు. ఎందుకు మొరం తరలిస్తున్నారో, ప్రభుత్వం ఎక్కడ మొరంకు పర్మిషన్ ఇచ్చిందో చూపాలని పట్టుబట్టారు.

పట్టించుకోని అధికారులు..
ఇంత పెద్ద ఎత్తున గ్రామస్తులకు, మొరం దందా వ్యాపారం వ్యక్తులకు ఘర్షణలు జరుగుతున్నా రెవిన్యూ అధికారులు మాత్రం తమకు ఏమీ తెలియనట్టు చోద్యం చూస్తున్నారని ప్రజలు అగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పలుకుబడి ఉన్న బడా బాబులకే మద్దతు తెలుపుతున్నారని గ్రామస్తులు ఆందోళన చేశారు. అధికారులు పట్టించుకోకుంటే స్పీకర్ పోచారం, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, అప్పటి వరకు మొరం తరలించిదేది లేదని అడ్డుకొన్నారు.


నీలాలో మేరా మట్టి, మేరా దేశ్

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాల, పెద్దమ్మతల్లి ఆలయంలో పవిత్ర మట్టిని సేకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఎంపీపీ రజిని కిషోర్, జడ్పీటీసీ మేక విజయ సంతోష్, మండల ఉపాధ్యక్షులు ఖ్యాతం యోగేష్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు పూర్తి కావడంతో గ్రామంలో 75 మొక్కలను నాటారు. చేతిలో మట్టిని తీసుకొని విద్యార్థిని విద్యార్థులతో పంచప్రాణాల ప్రతిజ్ఞ చేశారు. అట్టి మట్టిని దేశ రాజధాని ఢిల్లీకి పంపడానికి ఏర్పాటు చేసినా కలశంలో ఉంచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత రాఘవేందర్, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, మండల అధ్యక్షులు గోపి, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు బండారి రవి, మమ్మాయి శివకుమార్, ఐటీ సెల్ శివకుమార్, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని కందకుర్తి గ్రామపంచాయతీ ఆవరణలో నలుగురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు సర్పంచ్ మీర్జా కలీం బేగ్ పేర్కొన్నారు. అజీజా బేగం రూ.27,000, ఖలీల్ రూ.18000, రేష్మ రూ.20000, పర్వీన్ బేగంకు రూ.22,500 మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి చెక్కులకు సహాయ సహకారాలు అందించిన బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆమీర్, ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అసాద్ బేగ్, నీల సింగిల్విండో చైర్మన్ ఇమామ్ బేగ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ కిసాన్‌కేత్ అధ్యక్షులుగా కిషన్


బోధన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కిషన్

నవతెలంగాణ-వర్ని
బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ కిసాన్‌కేత్ ఇంచార్జీగా శనిగరం కిషన్‌కు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి ఆదేశాల మేరకు కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, వర్ని కిసాన్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు శనిగరం కిషన్‌ను బోధన్ నియోజకవర్గ కిసాన్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా నియమించారు. ఈ సందర్భంగా శనిగరం కిషన్ మాట్లాడుతూ.. తనపైన నమ్మకంతో ఈ బాధ్యత ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

నూతన గుడాడిరెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో మారవారి గుడాడి రెడ్డి సంఘం నూతన కార్యవర్గం గురువారం ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడు మార శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మార రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు మార శ్రీనివాస్‌రెడ్డి, చిన్న గంగారెడ్డి, కోశాధికారులు మార మహిపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు అంజిల్ రెడ్డి, రమేష్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సలహాదారుడు మార బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే పూర్తి

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని కందకుర్తి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేను పూర్తి చేసినట్లు గ్రామ కార్యదర్శి నవీన్ పేర్కొన్నారు. ఈ గ్రామంలో 940 కుటుంబాలలో పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణం, కుటుంబాల సమగ్ర నివేదిక తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడ్‌బిలోలి గ్రామ కార్యదర్శి రాఘవేందర్ గౌడ్, కూనేపల్లి గ్రామ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, ప్రధానోపాధ్యాయులు బి.వెంకటలక్ష్మి గురువారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్, గ్రామ కార్యదర్శి సిహెచ్.సాయి, ఉపాధ్యాయులు పరమేశ్వర్, రాధా తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం దరఖాస్తు కౌంటర్ కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-దోమకొండ
మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సంజయ్‌రావు ఆధ్వర్యంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముదం గంగయ్య డిప్యూటీ తహసీల్దార్ కౌశిక తదితరులున్నారు.

లింగంపేట్‌లో ఆజాదికా అమృత మహొత్సవం

నవతెలంగాణ-లింగంపేట్
మండల కేంద్రంలో గురువారం ఆజాదీకా అమృతోత్సవంలో భాగంగా నా మట్టి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా వీరొంకా వందన్ రిటైర్డ్ ఆర్మీ శంకర్‌ను బీజేపీ మండల అధ్యక్షులు జక్సాని దత్తురాములు, మండల కార్యవర్గము వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మహారాజుల మురళి, మండల ప్రధాన కార్యదర్శి వడ్ల రామచందర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బొల్లారం సాయిలు, పట్టణ అధ్యక్షులు మంగళి నవీన్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు రాజారాం, బాలయ్య రాజారాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ అన్నారు. మండలంలోని భిక్నూర్, వెంకటాపూర్, శివపూర్ గ్రామాలలో గురువారం పల్లెపల్లెకూ కాంగ్రెస్ గడప గడపకు మదన్ మోహన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. రాబోయే రోజుల్లో ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అన్నారు. పలు గ్రామాల్లో ఇంటి ఇంటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆజహర్, అరిఫ్, సంతోష్, మహేష్, అనిల్, రవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పొదల్లో క్రీడా బోర్డు

- అధికారుల నిర్లక్ష్యం


ముళ్ల పొదల్లో క్రీడ ప్రాంగణ బోర్డు

నవతెలంగాణ-వర్ని
మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో క్రీడా ప్రాంగణం బోర్డు ముళ్ల పొదలో పడేసినా పట్టించుకొనే నాథుడే లేడు. ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తే అధికారులు, ప్రజాప్రతినిధులు పనులను పట్టించుకోవడం లేదని ప్రజల ఆరోపిస్తున్నారు.

క్రీడా బోర్డు గత కొన్ని రోజుల నుంచి పొదలలో ఉన్న పంచాయతీ సిబ్బంది కూడా పట్టించుకోకపోవటం నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనబడుతోంది. హుమ్నాపూర్ క్రీడా ప్రాంగణం జాడేలేదు. గ్రామంలో బోర్డు పొదలలో ఉన్నా. క్రీడా ప్రాంగణం మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో గ్రామ ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తండాలో రాత్రి బస చేసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సుభాష్‌రెడ్డి బుధవారం రాత్రి తిమ్మారెడ్డి తాండలో రాత్రి బస చేశారు. తాండ ప్రజలతో కలిసి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి అదే విధంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి, కొమరం భీమ్ చిత్రపటానికి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం తాండ ప్రజలతో ఆదివాసి గిరిజన దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి మహనీయులు చేసిన సేవలు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గిరిజనులకు చేయబోయే ముఖ్యమైన అంశాలను వివరించి అనంతరం అక్కడే తాండా ప్రజలతో కలిసి రాత్రి బస చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపిపి నర్సింహులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెండో విడత నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

నవతెలంగాణ-రెంజల్
మండలం లో రెండో విడత నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసినట్టు డాక్టర్ వినయ్ కుమార్, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, చింతల శ్రావణ్ కుమారులు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో వైద్య సిబ్బందితో ఇటీవల ఈ మాత్రలు తీసుకోలేని విద్యార్థినీ విద్యార్థులను గుర్తించి వారికి ఉపాధ్యాయుల సమక్షంలో మాత్రను వేసినట్టు తెలిపారు.

మహా ధర్నాకు తరలిరావాలి

నవతెలంగాణ-రెంజల్
మండల కేంద్రమైన రెంజల్ గాంధీ విగ్రహం ఎదుట నిర్వహిస్తున్న రైతుల రిలే దీక్ష 44వ రోజుకు చేరుకుందని, కాగా.. శుక్రవారం చేపట్టే మహాధర్నాకు మండల కేంద్రంలోని రైతు కుటుంబాలన్నీ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక రైతు నాయకులు పేర్కొన్నారు. 44 రోజులుగా దీక్ష చేపట్టినప్పటికీ ప్రభుత్వానికి స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. శుక్రవారం వంట వార్పు కార్యక్రమంతో పెద్దఎత్తున నిరసన చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం
కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అంతక ముందు స్థానిక సాయిబాబా ఆలయంలో సుభాష్‌రెడ్డి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నర్సింహులు, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆఫీజ్, పరందములు, బలకిషన్, నీల రవి పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండల కేంద్రంలో ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో గల బీసీ హాస్టల్ నందు జన్మదిన వేడుకలు నిరాడంబరంగా కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి నోట్ బుక్కులు, పెన్నులు, పండ్లు విద్యార్థులకు మండల కాంగ్రెస్ కమిటీ తరుపున అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో సభాష్‌రెడ్డి జన్మదిన వేడులు


గాంధారిలో సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

గాంధారి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు మోహన్ నాయక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మోహన్ నాయక్, నాయకులు వెంకట్రాంరెడ్డి, సంగెం రాజు, చిమ్మని సాయిలు, జువ్వాడి సంగయ్య, శ్రీనివాస్, జస్వంత్‌గౌడ్, రాథోడ్ సుభాష్, శేఖర్ ముదిరాజ్, రాజు నాయక్, చిన్న సంగమేశ్వర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులపై వివక్ష సరికాదు

- సీపీఐ(ఎం) కార్యదర్శి నన్నేసాబ్

నవతెలంగాణ-వర్ని
జీపీ కార్మికులపై కక్ష సాధింపులు మానుకోవాలని సీపీఐ(ఎం) కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని ఆయన అడ్డుకుని మాట్లాడారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని సత్యనారాయణపురం గ్రామపంచాయతీ కార్మికులు తమ మాట వినకుండా సమ్మె చేశారని ఆగ్రహంతో కార్మికులపై సర్పంచ్ నాగమణి వీర్రాజు, కార్యదర్శి సాయిలు కక్ష సాధింపులకు పాల్పడడం అన్యాయమని పద్ధతి మార్చుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ మేక శ్రీలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నన్నేసాబ్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులు 34 రోజులు సమ్మె కొనసాగించగా రాష్ట్ర ప్రభుత్వంతో యూనియన్ జేఏసీ నాయకుల చర్చలు సఫలమవ్వడంతో ఈనెల 9న విధుల్లో చేరుతున్నామని ఎంపీడీవో బషీరోద్దీన్‌కు సమ్మె విరమణ నోటీసు అందజేసి, గ్రామపంచాయతీకి వెళ్లగా మల్టీపర్పస్ కార్మికులే రావాలని మిగతావారు వెళ్ళిపోవాలని గ్రామపంచాయతీ ఈఓ సాయిలు అనడం ఎంతవరకు సమంజసమని ఆయన మండిపడ్డారు. కార్మికులందరినీ విధుల్లోకి తీసుకుంటేనే పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాయిచరణ్, రాజు, సాయిలు, గంగారాం, నర్సయ్య పారిశుద్ధ్య కార్మికులు విరవ్వ, గంగామణి, సాయవ్వ, లక్ష్మవ్వ తదితరులు పాల్గొన్నారు.


సామావేశంలో మాట్లాడుతున్న నన్నేసాబ్

గృహలక్ష్మి పథకానికి గడువును పెంచాలి

- జిల్లా అధ్యక్షురాలు అరుణతార

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గృహలక్ష్మి పథకం గడువును పెంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార డిమాండ్ చేశారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ కార్యాలయం ముందు పార్టీ జెండా ను ఎగురవేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వైన్స్‌లకు టెండర్ల ప్రక్రియలో రోజుల తరబడి గడువు పెరుగుతుందని పేదవారికి గృహం నిర్మాణం కొరకు దరఖాస్తుల స్వీకరణ నేటితో ముగియనున్న నేపథ్యంలో ప్రజలు మీసేవ కేంద్రాల వద్ద, జిరాక్స్ సెంటర్ల వద్ద, తహసీల్దార్ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారని గడువు పేరిట తెలంగాణ రాష్ట్ర ప్రజలను గాబర పెడుతున్నారని విమర్శించారు.

బైండ్ల పోచన్న ఆధ్వర్యంలో భారీ చేరికలు..
రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైండ్ల పోచన్న ఆధ్వర్యంలో లక్ష్మపూర్, ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి బీజేపీ నాయకులు దేవేందర్, మర్రి బాలకిషన్, మంగలి సతీష్, రాజేష్, కుర్మ సాయిబాబా, నరేష్, బలరాజ్, పోతుగంటి సాయిలు, ప్రశాంత్, పులి రమేష్, గంపల వెంకన్న బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సాటాపూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని సాటాపూర్ గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను నిర్వహించినట్లు డాక్టర్ విట్టల్ పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా ప్రభుత్వం ఉచితంగా ఈ టీకాలను అందజేసిందని ఆయన తెలిపారు. గ్రామంలో 396 పశువులకు, గేదెలకు, దూడలకు, గాలికుంటూ వ్యాధి టీకాలను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నవీన్, గోపాల్ మిత్ర యశ్వంత్, రైతు నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సాటాపూర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి
మండలంలోని మాధవపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ రాధబలరాం, జడ్పీటీసీ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మమ్మాయి సంజీవ్ యాదవ్‌లతో కలసి స్థానిక సర్పంచ్ లక్ష్మీబాయి మహిపాల్‌రావు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యం, ఏఎంసి వైస్ చెర్మెన్ రెడ్డిరాజు, ఎంపీటీసీ సభ్యులు బాలరాజు, ఉపసర్పంచ్ నారాయణ రావు, బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజేందర్ రావు, నాయకులు ప్రభాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

పద్మశాలీల ఐక్యత చాటాలి

- పద్మశాలి రాజకీయ యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ
- జిల్లా అధ్యక్షులు సరిగాధ లక్ష్మీ నరసింహులు

నవతెలంగాణ-తాడ్వాయి/రెంజల్
పద్మశాలీలు రాజకీయ యుద్ధభేరి ఈ నెల 13న ఆదివారం జగిత్యాల జిల్లా కొరుట్లలో జరగబోయే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మండలంలో సిరిగాద లక్ష్మీనరసింలు, గుజరాజు అధ్యక్షతన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరూ కలిసి ఐక్యంగా విజయవంతం చేయాలన్నారు. ఈ రాజకీయ యుద్ధభేరి కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు మండల నాయకులు వివిధ హోదాలో ఉన్న నాయకులు పార్టీలకు అతీతంగా అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పద్మశాలి ఐక్యత చాటి మన రాష్ట్రంలో చరిత్ర సృష్టించాలని కోరుకుంటున్నామన్నారు.

రెంజల్ : ఈనెల 13న కోరుట్లలో నిర్వహించే పద్మశాలి రాజకీయ యుద్ధభేరికి బోధన్ డివిజన్ నుంచి అత్యధిక సంఖ్యలో తరలిరావాలని పద్మశాలి సంఘం బోధన్ నియోజకవర్గం అధ్యక్షులు మేక సంతోష్, ప్రచార కార్యదర్శి గంగాధర్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు లచ్చేవార్ నితీన్‌లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని సాతాపూర్ చౌరస్తాలో పద్మశాలి రాజకీయ యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు లచ్చేవారు సంతోష్, అశోక్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన 108, 102 అంబులెన్స్ వాహనాలను ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపర్ ఇండెంట్ డాక్టర్ నాగరాజు డాక్టర్ అమత్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు గొడుగుల పంపిణీ..

డివిజన్ ఆశావర్కర్లకు వర్షాకాలం సందర్భంగా గొడుగులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మీద అభిమానంతో కేసీఆర్ ఆకారంలో నిలబడి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కళాభారతికి గద్దర్ పేరు పెట్టాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్‌లో నిర్మించే కళాభారతికి గద్దర్ పేరు పెట్టాలని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు ఎడ్ల నాగరాజు, జిల్లా అధ్యక్షులు అనంపల్లి ఎల్లం అన్నారు. నిజామాబాద్ నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ లో మాలమహానాడు ఆధ్వర్యంలో గద్దర్ సంతప సభా నిర్వహించారు. గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గద్దర్ బోధన్‌లో విద్యను అభ్యసించారని, నిజామాబాద్‌లో నిర్మించే కళాభారతి కి గద్దర్ పేరు పెట్టాలని, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ పైన గద్దర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన తెలంగాణ ఉద్యమానికి పాటలతో ఎంతో ఊపిరి పోశారు అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నంది వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల కిష్టయ్య, పట్టణ అధ్యక్షులు ఎడ్ల ధనరాజ్, కార్యదర్శి బట్టి గంగాధర్, మహిళ అధ్యక్షురాలు మాధవి, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళ్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో ప్రజాకవి గద్దర్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రజాకవి గద్దర్‌కు నిజామాబాద్ జిల్లాతో ప్రత్యేక బంధం ఉండేదని, తెలంగాణ ఉద్యమం సమయంలో జిల్లా విద్యార్థి నాయకులతోపాటు అనేకమంది ఉద్యమకారులతో జిల్లా ప్రజానికంతో మమేకమై ధూమ్ ధామ్ కార్యక్రమాలు నిర్వహించి జిల్లా ఉద్యమానికి ఊపిరినిచ్చారన్నారు. ప్రజల బాధలను, రాజ్యహింసను పాటల రూపంలో తూటాలుగా పేల్చిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ గద్దర్ అన్నారు. తను మరణించిన కూడా తన ఆటపాట మాట పీడితుకులాల పోరుబాటుకు గొంతుకగా యావత్తు ప్రజానీకాన్ని ఉద్యమాల వైపు మళ్లించడంలో తన జ్ఞాపకాలు ఎప్పుడు ఉంటాయని అన్నారు. ప్రజాసమస్యలకై ఉద్యమించి పేద , బడుగు, బలహీన, పీడిత, తాడిత జీవితాలు అభివృద్ధే గద్దర్‌కు నిజమైన నివాళులు అని అన్నారు. గద్దర్ స్ఫూర్తితో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజాఉద్యమాలకు ప్రజలు ఉద్యమించాలని పిలునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గోపాల్, సాయి, గణేష్, నితిన్, అవినాష్, సిద్ధిరామ్, శివ, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకులపై దాడి హేయమైన చర్య

- డీసీపీపై చర్యలు తీసుకోవాలి
- విద్యార్థి సంఘాలు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

విద్యార్థి సంఘ నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అని విద్యార్థి సంఘాలు నాయకులు మండిపడ్డారు. గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులపై విచక్షణా రహితంగా దాడులు చేయడం అప్రజాస్వామికమైన చర్యఅని అన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ అంటే న్యాయం కోసం ప్రశ్నించే విద్యార్థి సంఘాలపై దాడి చేయడమేనా అని అన్నారు. విద్యార్థి సంఘ నాయకులపై దాడి చేసిన డీసీపీ వెంకటేశ్వర్లు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి శ్మశాన వాటికల పై ఉన్న ప్రేమ, ప్రభుత్వ విద్యా రంగంపై లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయించకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. మరో తెలంగాణ ఉద్యమ పోరాటం ప్రారంభించాల్సి అవసరం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నవీన్ కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ.అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు విశాల్ పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ కోసం కృషిచేస్తా

- ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్
- టీయూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణను (త్రిపుల్ ఐటీ బాసర) మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు వివరించినట్లు యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షులు వి.దత్తహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేశామని, తొందరలోనే ప్రభుత్వం దష్టికి సమస్యలను తీసుకువెళ్లి వెంటనే పరిష్కారానికి కషి చేస్తామన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కెసిఆర్ సైతం తమందరికి గతంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఎస్ఐ సాధించిన శ్రీ సాయికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



శ్రీసాయిని సన్మానిస్తున్న నాయకులు

ఇటీవలే విడుదలైన టిఎస్ ఎల్ పిఆర్‌బి ఫలితాల్లో బాసర జోన్ లో ప్రథమ స్థానంలో నిలిచి ఎస్ఐ ఉద్యోగం సాధించిన మండల కేంద్రానికి చెందిన సల్లూరి శ్రీసాయి ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్కరించారు. గురువారం పలువురు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి ఆధ్వర్యంలో శ్రీ సాయి కుటుంబ సభ్యులను కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలపు నరసయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, సల్లూరి గణేష్ గౌడ్, నల్ల గణేష్ గుప్తా, సింగిరెడ్డి శేఖర్, తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ కమ్మర్ పల్లి మండల కేంద్రంలో శ్రీ సాయిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుంకేట రవి, బుచ్చన్న, శ్రీను, నర్సయ్య పాల్గొన్నారు.

ఉపయోగంలోకి రానీ వైకుంఠధామాలు

- సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వైకుంఠధామాలు నిర్మించి ఆర్భాటంగా ప్రారంభించారని, అవిఇంకా పయోగంలోకి రాలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్ మండిపడ్డారు. నిజామాబాద్ నగరంలో మంత్రి కేటీఆర్ ఆర్భాటంగా ప్రారంభోత్సవం చేసిన వైకుంఠధామాలను సిపిఎం ఆధ్వర్యంలో దుబ్బా ప్రాంతంలో సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామాలు ఘనంగా ప్రారంభమైనా ఇంకా ఉపయోగం లోకి రాలేదని అన్నారు. నిన్న దుబ్బా ప్రాంతంలో వైకుంఠధామం ప్రారంభమైనప్పటికీ నేడు రోడ్లపైనే శవాన్ని కాల్చుకునే దుస్థితి ఉందన్నారు. అసంపూర్తి పనులతో, హడావిడి ప్రారంభోత్సవాలు ఎందుకో అధికార పార్టీ నేతలు ప్రజలకు సంజాయిషి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి వైకుంఠధామాలను అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ద్యారాంగుల కృష్ణ, నాయకులు అనిల్ కుమార్, నాగిరెడ్డి, దేవిదాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ సాధ్యం

- నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం సుదర్శనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

అవగాహనతోనే హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ యం. సుదర్శనం పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్‌లోని ఉమెన్స్ కళాశాల, కేర్ డిగ్రీ, గిరిరాజ్ కళాశాల, విద్యార్థిని విద్యార్థులతో నిర్వహించిన జిల్లా స్థాయి 5కే రన్‌ను డిఎం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

అండ్ హెచ్ఓ డాక్టర్ సుదర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్‌కి నివారణ ఒక్కటే మార్గమని, ప్రజల్లో అవగాహనా కల్పించేందుకే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలలో ఈ 5కే రెడ్ రన్, క్విజ్ పోటీలు, షార్ట్ ఫిల్మ్ స్కిట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మారథన్ 5కే రన్‌లో ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురులను పరుగుపందెంలో ఎంపిక చేశారు. గెలిచిన వారికీ డి ఎం అండ్‌హెచ్ఓ, ట్రాఫిక్ సిఐ రాథోడ్ పతకాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కో ఆర్డినేటర్ శైలి బెల్లా, వైద్యాధికారులు సంతోష్, ప్రవీణ్, డీపీఎం సుధాకర్, జిల్లా టిబి హె.చ్.ఐ.వి కో ఆర్డినేటర్ రవిగౌడ్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేష్, మధుకర్, స్నేహ సొసైటీ సిద్ధయ్య, సూర్య హెల్త్ ఆర్గనైజషన్ రాజేంద్ర, లింక్ వర్కర్ సూపెర్వైసోర్ నారాయణ, మహేందర్, ప్రవీణ్, స్రవంతి,మహేష్ నవీన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి హామీతో కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇచ్చిన హామీతో సమ్మె తాత్కాలిక విరమించినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దాసు, సుధాకర్ తెలిపారు. రాష్ట్ర జేఏసీ 8 ఆగస్టు 2023 హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర జేఏసీ చర్చించి ప్రకటించిందని అన్నారు. గురువారం డిపిఓ జయసుధకు జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె విరమణ లేఖను అందజేశారు. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక డిమాండ్లలో ఆర్థికేతర డిమాండ్లు కారోబార్లను బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియామకం, పీఎఫ్ ఈఎస్ఐ, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, ఎనిమిది గంటల పని విధానం, పండుగ, వారాంతపు, జాతీయ, ఆర్జిత సెలవులు సమ్మె విరమించిన వెంటనే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాల పెంపు, పెర్మనెంట్ తదితర కీలక డిమాండ్లను ముఖ్యమంత్రితో మాట్లాడి సానుకూలంగా పరిష్కరిస్తామని, అందుకుగాను ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు తాను బాధ్యత తీసుకుంటామని హామీ మేరకు సమ్మెను విరమించవలసిందిగా రాష్ట్ర జేఏసీకి దయాకర్ రావు విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఈనెల 9 నుండి సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు రాష్ట్ర జేఏసీ నిర్ణయించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే కార్యరూపంలోకి తీసుకురావాలని దాసు ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా పనిలోకి తీసుకోవాలని గ్రామ కార్యదర్శులకు, సర్పంచులకు, ఎండిఓ లకు తెలియజేస్తూ డిపిఓ జయసుధ జేఏసీ బృందంతో



డీపీఓకు వినతిపత్రం అదజేస్తున్న నాయకులు

ప్రెస్‌ముందు మాట్లాడారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ జిల్లా నాయకులు జాకీర్ రాజేశ్వరి హనుమాన్లు ధర్మానందు శ్రీనివాస్ ప్రదీప్ పసియోద్దీన్ సాయిలు లక్ష్మి గంగాధర్, ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటి, రమేష్, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)జిల్లా ఉపాధ్యక్షులు భానుచందర్, కార్యదర్శి జేపీ.గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చెక్కు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన అంగళ్ల లక్ష్మణ్ కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కును గురువారం పంపిణీ చేశారు. రూ.27వేల ఆర్థిక సహాయం చెక్కును మంజూరు చేయగా గురువారం లబ్ధిదారుని ఇంటి వద్దకు వెళ్లి సర్పంచ్ సక్కారం అశోక్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బై కానీ మహేష్ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొడ దేవేందర్, తోట అప్పయ్య, నర్రా మోహన్, రాజు, రమేష్, నర్సయ్య, జయరాం, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఈతమొక్కలు నాటిన అధికారులు



మొక్కలు నాటుతున్న అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్ పేట్ గ్రామంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గోవింద్ పేట్ గీతా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈత మొక్కలను గురువారం నాటారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ , డిస్ట్రిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ కె. మల్లారెడ్డి ఈతమొక్కల ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్టీవెన్సన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్స్ ఎ.గంగాధర్, ప్రమోద్ చైతన్య, చంద్రమౌళి, సర్పంచ్ జమున గంగాధర్, గౌడ సంఘం అధ్యక్షులు గంగాధర్ గౌడ్, ఎంపీటీసీ రాజ్ కుమార్, పిఏసిఎస్ చైర్మన్ మైపాల్, విడిసి చైర్మన్ లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుకన్య రెడ్డి, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు యాదగౌడ్, ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయం హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ కాకతీయ కాదు.. కమిషన్ కాకతీయ

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

చెరువుల పునరుజ్జీవన పథకం మిషన్ కాకతీయ కాదని.. కమిషన్ కాకతీయని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని ఇనాయత్ నగర్ గ్రామంలోని నాగులపాటికుంట చెరువున సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మిషన్ కాకతీయలో భాగంగా ప్రతి చెరువుకు అలుగు వరద కాలువ నిర్మాణాలు చేశారన్నారు. ఆ వరద కాలువ నిర్మాణలను సాంకేతికంగా కాకుండా ఇష్టారీతినా



రైతులతో మాట్లాడుతున్న ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి

నిర్మించడంవల్లే చెరువులోని వరద నీరు అలుగు ద్వారా కాకుండా పంటపొలాల్లోకివెళ్లి సుమారు గ్రామంలోని 20ఎకరాల్లో పంటలు నీటిపాలయ్యాయన్నారు. చెరువుకు ఆనుకొని కట్టాల్సిన అలుగు కాలువకు మధ్యలో రోడ్డు వేసి ఆ రోడ్డును ఎత్తులో నిర్మించడం వల్ల మూడేండ్లుగా చెరువులోని నీరు పంటపొలాల్లోకి వెళ్లి తీవ్ర పంట నష్టం జరుగుతుందన్నారు. మూడు సంవత్సరాలుగా రైతులు, గ్రామస్తులు కమ్మర్‌పల్లి తహసీల్దార్‌కు సమస్యను విన్నవించుకున్న వారి గోడును పట్టించుకునే నాథుడేలేడన్నారు. ఈ పథకం కేవలం మంత్రి ప్రశాంత్ రెడ్డి, కాంట్రాక్టర్లు మాత్రమే లాభపడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందించాలని, చెరువుకు మరమ్మత్తులు చేసి పంట పొలాలు కాపాడాలని అన్నారు. లేకుంటే తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కుంట భూమారెడ్డి, ఎగుర్ల రవి, జక్కుల మల్లికార్జున్, పర్స మల్లయ్య, మానాల రాజు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఏర్గట్ల



పాలాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

రేషన్ డీలర్ల కమిషన్ 70 రూపాయల నుండి 140 రూపాయలను పెంచుతూ.. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయానికి గాను ఏర్గట్ల మండల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తంచేస్తూ గురువారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు రెహమాన్, పిట్ల మీనానరేష్, గంగకిషన్, పొలిశెట్టి రమరాణి అశోక్, భూమన్న, శ్రీనివాస్,సతీష్,చంద్రకళ పాల్గొన్నారు.

నిజామాబాద్ అభివృద్ధికి బీఆర్ఎస్ చేసింది శూన్యం

- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌ను అన్ని విధాల అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీయోనని, బీఆర్ఎస్ చేసింది శూన్యమని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ విమర్శించారు. గురువారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్‌తో కలిసి మాట్లాడారు. బుధవారం జిల్లాకు వచ్చిన కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడారని, కాంగ్రెస్ పార్టీ అంటే అవినీతి అని ఆయన మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాజకీయాల్లో కేటీఆర్ ఒక పిల్ల బచ్చా అని, కాంగ్రెస్ చరిత్ర కాంగ్రెస్ పార్టీ దేశ అభివృద్ధి కోసం చేసిన కృషిని గురించి ఆయన తండ్రి కేసీఆర్‌ను అడిగితే తెలుస్తుందని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు పట్టుబట్టి సోనియా గాంధీతో మన్మోహన్ సింగ్ తో మాట్లాడి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని తెలిపారు. అందులో తమరి తండ్రి పాత్ర చాలా చిన్నదని, కానీ ప్రత్యేక రాష్ట్రం తామే సాధించామని గొప్పలు చెప్పుకొని అమాయక ప్రజలను మోసం చేశారని అన్నారు. ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో అమెరికా నుండి దిగిన కేటీఆర్, కవితకు తెలంగాణ ఉద్యమానికి ఎలాంటి సంబంధం లేదని కేవలం వాళ్ల తండ్రి పేరును అడ్డం పెట్టుకొని రాజకీయంగా ఎదిగారని, వాళ్లకు అంత సీన్ లేదని ఆయన ఎద్దేవా చేశారు. అవినీతికి పాల్పడి లక్షల కోట్లు సంపాదించిన కుటుంబం కేవలం కల్వకుంట్ల కుటుంబమేనని విమర్శించారు. తాము నిర్మించిన మునిసిపల్ భవనానికి కిటికీలు పెట్టడానికి తొమ్మిది సంవత్సరాల సమయం పట్టిందని, ఈ ఒక్క ఉదాహరణ చాలు నిజామాబాద్ అభివృద్ధిపై బీఆర్ఎస్‌కు ఉన్న చిత్తశుద్ధి తెలిసిపోతుందని ఆయన అన్నారు. కేటీఆర్, కవిత, అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తాలు ఐటీ హబ్ పేరుతో వాటి చుట్టుపక్కల ఉన్న భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర లేపారని తెలిపారు. నిజామాబాద్ నగరంలోని 50 వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఎంతమందికి ఇచ్చారో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమర్తి గోపి, జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్, రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ, చందూర్ జెడ్పీటీసీ అంబర్ సింగ్, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్,జిల్లా కాంగ్రెస్ ఉపధ్యక్షుడు దయాకర్ గౌడ్, చందూర్ వైస్ ఎంపీపీ దశ గౌడ్, చందూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, నగర మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ ఏజాజ్,మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోమ్ గార్డు మృతి

- నివాళులర్పించిన అదనపు డీసీపీలు



పూలమాలవేస్తున్న డీసీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోమ్ గార్డుకు అదనపు డీసీపీ నివాళులర్పించారు. బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎమ్. జలంధర్ బుధవారం ద్విచక్ర వాహనంపై వెళ్లే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. హుటాహుటిన నిజామాబాద్ లోని మనోరమ హస్పటల్కు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మృతి చెందారు. మృతుడి స్వస్థలం తాళ్లరాంపూర్ గ్రామం. ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా ఆసుపత్రిలోని పోస్టుమార్టం గది వద్ద నిజామాబాద్ అదనపు పోలీస్ కవి ఎస్. జయరామ్, అదనపు పోలీస్ కమిషనర్ పి. గిరిరాజు (ఏఆర్) పుష్పగుచ్చాలతో నివాళులు అర్పించి మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రిజర్వు ఇన్స్పెక్టర్ వెంకటప్పల నాయుడు, ఏర్గట్ల ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి నిధులు కేటాయించిన కేటీఆర్‌కు ధన్యవాదాలు

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగల గణేష్ గుప్తా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర అభివద్ధిపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర ఐటీ పురపాలక పరిశ్రమల శాఖ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు ఇచ్చిన కితాబు తనున ఎంతో ఆనందానికి గురిచేసిందని, తొమ్మిది ఏళ్లలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివద్ధిని సభా వేదికపై మంత్రి కేటీఆర్ వివరించడం సంతోషాన్ని కలిగిస్తోంది ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అ్నఅ్నరు. కేసీఆర్, కేటీఆర్, కవిత మార్గదర్శనంలో వారి సహాయ సహకారాలతో నిజామాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించానని అన్నారు. నిజామాబాద్ నగరం మరింత అభివద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ కార్పొరేషన్‌కు 60 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిన కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. బెస్ట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్, బెస్ట్ వైకుంఠ ధామాలు అని స్వయంగా కేటీఆర్ వివరించడం మరింత స్ఫూర్తిని అందించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో 55 వేల ఓట్ల మెజార్టీతో తనను గెలిపించాలని స్వయంగా కేటీఆర్ గారు ఆకాంక్షిస్తూ ప్రజలను కోరడం ఎంతగానో ప్రోత్సాహాన్ని ఉత్సాహాన్ని అందించిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

తల్లిపాలవల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలోని మంచిప్ప గ్రామంలో సిడిపిఓ సౌందర్య అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా సాధికారిక సంస్థ చైర్మన్ ఆకుల లలిత హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలోనే ఆరు నెలల ప్రసూత సెలవులు ఇవ్వడం వారి బాగోగులు చూసుకోవడం జరుగుతుందని తెలిపారు. మామూలు పాలు తాగిన పిల్లల కంటే తల్లి పాలు తాగిన పిల్లలు చాలా తెలివిగలవారై ఉంటారని, అలాగే వారికి రోగనిరోధక శక్తి పెంపొందుతుందని, బిడ్డను జీర్ణకోశ వ్యాధులనుండి అలర్జీ, దమ్ము, చర్మ సంబంధిత వ్యాధుల నుండి ఈ తల్లిపాలు రక్షిస్తాయని తెలిపారు. బిడ్డకు అవసరమైన పోషకాలు తల్లిపాలలో సమృద్ధిగా ఉంటాయని తెలిపారు, భార్యాభర్తల సమస్యలు ఉన్న, అత్తమామలతో గొడవలు ఉన్న సఖి కేంద్రంలోనైనా, వారింటి వద్దనైనా పరిష్కరిస్తారని చెప్పారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సుధాలక్ష్మి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై ఆమె మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కేవలం అన్ని వ్యవస్థలో కెల్లా అత్యంత కీలకంగా పనిచేసిన వ్యక్తుల్లో అంగన్వాడీ టీచర్లని, తోబట్టువులు కూడా దగ్గరికి రాని సమయంలో వారు ప్రతి ఇంటికి వచ్చి అన్ని రకాల సదుపాయాలు అందజేయడంలో ముందంజలో ఉన్నారని అన్నారు. పీడియాట్రిక్ డాక్టర్ దీపక్ రాథోడ్ తల్లిపాల ప్రాముఖ్యత గురించి ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. సిడిపిఓ సౌందర్య మాట్లాడుతూ గర్భిణీ సమయంలో మంచి ఆహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని అటువంటి అప్పుడే నార్మల్ డెలివరీతోపాటు, బిడ్డ కూడా అధిక



ఆకుల లలితకు మొక్కను అందజేస్తూ...

బరువుతో చాలా ఆరోగ్యంగా పుడుతుందని అన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయ్యే వారికి ప్రత్యేక కిట్టుతోపాటు నగదు ఇస్తారని తెలిపారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో డిడబ్ల్యుఓ రసూల్‌బి, సూపర్వైజర్లు శ్రీ ప్రియ, స్వరూప, జాకిర బేగం, విశాల, సర్పంచ్ సిద్ధార్థ, ఉప సర్పంచ్ జగదీష్, కో ఆప్షన్ మెంబర్ అజీమ్, సాయిరాం, గ్రామఅధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు

అంకాపూర్‌లో జీవాలకు టీకాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఉన్న బర్రెలు, ఆవులు గొర్రెలు మేకలకు టీకాలు ఇచ్చినట్లు మండల పశు వైద్య అధికారి లక్కం ప్రభాకర్ గురువారం తెలిపారు. పశువులకు గాలి కుంటు వ్యాధి రాకుండా వ్యాధి నివారణ టీకాలు అలాగే గొర్రెలకు నీలి నాలుక వ్యాధి రాకుండా వ్యాధి నివారణ టీకాలు వేశారు. సర్పంచ్ ఆవుకు మొదటి టీకా వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్ రెడ్డి , ఎంపీటీసీ ల ఫోరం మండల అధ్యక్షుడు ఎంసీ గంగారెడ్డి, ఎంపీటీసీ మహేందర్ , కో ఆప్షన్ సభ్యులు ముక్తార్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు లింబా రెడ్డి, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ప్రజల వద్దకే పాలన

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాలు ప్రారంభం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

స్వరాష్ట్ర పాలనలో తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తెచ్చామని, వినూత్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్న ప్రభుత్వానికి మనం రుణపడి ఉండాలని ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. గురువారం మండలంలోని కస్లాబాద్, తలాబ్‌తాండలో గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఎంపీపీ ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అలాగే బాబుల్గం గ్రామంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మారుమూల తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం పనిచేస్తుందని, నూతన గ్రామపంచాయతీ భవనాలు, నిర్మాణాలు, సీసీ రోడ్లు బీటీ రోడ్లతో తండాలకు సులభమైన ప్రయాణం, మొదలగు నిర్మాణాలతో నూతన వైభవం వచ్చిందని, ఆసరా,


జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ భగీరథ తాగునీరు, వినూత్నమైన పథకాలతో ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. గ్రామపంచాయతీ నిధులను గ్రామ సభల్లో ముందస్తు ప్రణాళికలతో ఖర్చు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందని పంట వేసినప్పటి నుంచి రైతులు పంట అమ్మే వరకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని, రైతులు మరింత అభివృద్ధి చెందవచ్చునని అన్నారు. కరోనా మహమ్మారి వల్ల అభివృద్ధి పనులు వెనకబడి పోయాయని అన్నారు. అంతే కాకుండా తలాబ్ తాండ సర్పంచ్ గణపతిరావు నాగమడుగు లిఫ్ట్ పనులు పూర్తి అయిన తర్వాత వడ్లమ్ చెరువు నుంచి లిఫ్ట్‌తో శివపూర్, ఇతర గ్రామాల చెరువులో నీళ్లువచ్చేవిధంగా కృషి చేయాలని కోరాగా వెంటనే ఎమ్మెల్యే స్పందించి తప్పకుండా చెరువులను నింపుతామని హామీనిచ్చారు. అలాగే తలాబ్ తాండలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రయివేట్ దవాఖానకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. బాబుల్ గాంలో మన ఉరు మన బడి కార్యక్రమంలో భాగంగా నూతనంగా రెండు తరగతి గదులకు భూమిపూజ చేశారు. రూ.5లక్షల నిధులతో నిర్మిస్తున్న సి.సి.రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాసులబాద్ సర్పంచ్ శోభ బుసాప్ప, తలాబ్ తాండ సర్పంచ్ గణపతి రావు, తహసీల్దార్ దశరథ్, ఎంపీడీఓ రాణి, పంచాయతీ రాజ్ ఏ.ఈ.మధు, సర్పంచ్ మండల అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీ సాయిలు, ఉపసర్పంచ్‌లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరిక..

మండలంలోని బాబుల్గమ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీ నుండి అధికార బీఆర్ఎస్ పార్టీలోకి గ్రామ అధ్యక్షుడు వీరారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరారు. వీరికి ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఖండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప రెడ్డి, సర్పంచ్ ఎస్‌కేగౌస్, ఉపసర్పంచ్ నర్సుగొండ, మాజీ సర్పంచ్ విట్ఠల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం పరిశీలన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బాన్సువాడ ఆర్డీవో వి.బుజేందర్‌రావు గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ గది, రెవెన్యూ రికార్డులు స్వయంగా దగ్గరుండి తహసీల్దార్ గంగాసాగర్, డీటీ గంగాప్రసాద్, ఆర్ఐ రామారావ్ చూపించారు.


తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో

నాలుగు గ్రామాల రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని రాచూర్, సోముర్, డోంగ్లి మండలంలోని లింబూర్ వాడి, ఇలేగావ్, గ్రామాల రోడ్ల అభివృద్ధికి జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే కృషి ఫలితంగా ఈ నాలుగు గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి మొత్తం రూ.ఎనిమిది కోట్ల 10 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే నిధుల మంజూరు సర్క్యులర్ కాపీని జారీ చేశారు. ఏండ్ల తరబడి రోడ్ల కోసం ఎదురు చూసే గ్రామాల ప్రజల అవస్థలు తీరనున్నాయి. డోంగ్లి మండలంలోని లింబూరు వాడి గ్రామ ప్రజలకు బీటీ రోడ్డు లేక ఇరు గ్రామాల మధ్యలో వాగుపై వంతెన లేక ఏళ్ల తరబడి ఆ వాడి గ్రామ ప్రజలు వర్షాకాలంలో అవస్థలు పడుతూ వస్తున్నారు. వారి కళ నెరవేర్చేందుకు జుక్కల్ ఎమ్మెల్యే లింబూర్ గ్రామం నుంచి వాడి గ్రామం వరకు అలాగే మధ్యలో వాగుపైన వంతెన నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. డొంగ్లి మండలంలోని మరో గ్రామమైన ఇలేగావ్ గ్రామ ప్రజల అవస్థలు గుర్తించి మదన్‌హిప్పర్గా రోడ్డు నుండి ఇలేగావ్ వరకు రోడ్డు నిర్మాణానికి ఒక కోటి 80 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. అదేవిధంగా మద్నూర్ మండలంలోని రాచూర్ గ్రామ ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే 161వ జాతీయ రహదారి కందరుపల్లి నుంచి రాచూరం వరకు రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల 70 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఇక మద్నూర్ మండలంలోని పిడబ్ల్యుడి రోడ్డు నుండి సోముర్ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి 60 లక్షల మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



వీధి వ్యాపారులను ఆదుకోండి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలోని వీధి వ్యాపారులను ఆదుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ వస్తున్నారని ఆఘమేఘాల మీదా మున్సిపల్ అధికారులు వచ్చి మమ్మల్ని ఖాళీ చేయాలని గురువారం సూచించారని, తాము ఖాళీ చేస్తే మా కుటుంబాలు రోడ్డుపై పడుతాయని మమ్మల్ని ఆదుకోవాలని, అదేవిధంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో తమకు ప్రాధ్యాన్యతను ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలని కోరారు.

హౌసింగ్‌లోన్ ఉపయోగించుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో పురపాలక కార్యాలయం ముందు హౌసింగ్‌లోన్ రోడ్‌షోను గురువారం నిర్వహించారు. పట్టణంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నూతనంగా ఇంటి నిర్మాణం, నిర్మించిన ఇంటిపైన లోన్ కూడా ఇవ్వబడునని వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తీసుకొని బ్యాంక్ సిబ్బందికి సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ సత్యనారాయణ, ఏఏఎమ్‌హెచ్ బాన్సువాడ మేనేజర్ స్వాతి, ఏ.ఎమ్.ఎచ్ పి.ఓ యశ్వంత్, లింగంపేట్ మేనేజర్ అరుముగం, ధర్మారెడ్డి మేనేజర్ కిరణ్, ఇతర సిబ్బంది ఉన్నారు.


రుణాలపై అవగాహన

5 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరి టీకా వేసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని వెల్లుట్ల, వెల్లుట్లపేట్ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రాజేశ్వరి మాట్లాడుతూ.. 5 సంవత్సరాలలోపు పిల్లలు అదేవిధంగా గర్భిణీ మహిళలలు తప్పనిసరిగా టీకా వేసుకోవాలని తెలిపారు. అందరూ టీకా వేసే విధంగా గ్రామసభ తీర్మానం చేశారు. కార్యక్రమంలో వెల్లుట్ల సర్పంచ్ గంట రాజేశ్వరి, వెల్లుట్లపేట్ సర్పంచ్ చిరంజీవులు, ఎంఎచ్ జ్యోతి, ఏఎన్ఎం ఇందిరా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


గ్రామ సభలో గ్రామస్తులు

సీఎం చిత్రపటానికి రేషన్ డీలర్ల పాలాభిషేకం

నవతెలంగాణ-వర్ని

రేషన్ డీలర్లకు సీఎం కేసీఆర్ కమీషన్లు పెంచి డీలర్ల కుటుంబాలను ఆదుకున్నారని చందూర్ మండలాధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ నర్సింలు అన్నారు. గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి చందూర్, మోస్రా అధ్యక్షులు రాములు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, స్పీకర్ పోచారంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, డీలర్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.


చిత్ర పటానికి పాలాభిషేకం

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తారకు గురువారం వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేత

భగీరథ నీరు వృథా..

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని పోచారం తాండకు వెళ్లే రోడ్డు విద్యుత్ ఉప కేంద్రం వద్ద పోచారం తాండ, పోచారం గ్రామలకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నాయి. పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతుందని, వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

